# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 23-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలో భాగంగా కొద్ది సేపటి క్రితం బ్రిటన్ కు బయల్దేరారు.

❖ విపక్షాల నిరసనలతో వరుసగా మూడవ రోజు కూడా పార్లమెంటు ఉభయ సభల కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది.

❖ దేశ వ్యాప్తంగా పలు రహదారులపై గత ఆరు నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 27వేల మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.

❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 124వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలో భాగంగా కొద్ది సేపటి క్రితం బ్రిటన్ కు బయల్దేరారు. రెండు రోజుల పాటూ బ్రిటన్ లో పర్యటించి ఆ దేశ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపనున్నారు. ఇందులో భాగంగా ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై కూడా చర్చించనున్నారు. ఈ ఒప్పందం ద్వారా వాణిజ్యం, రక్షణ రంగం మొదలైన అనేక రంగాల్లో ఇరు దేశాల మధ్య సంబంధాలు బలోపేతమవడంతో పాటూ.. పరస్పర ప్రయోజనాలకు లబ్ధి చేకూరుస్తుందని బ్రిటన్ లో భారత హైకమిషనర్ విక్రమ్ కుమార్ దొరైస్వామి ఆకాశవాణికి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

బ్రిటన్ పర్యటన అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలై 25వ తేదీన మాల్దీవులకు వెళ్లనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తదుపరి ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించామని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. జగదీప్ ధన్‌ఖర్ చేసిన రాజీనామాను హోం మంత్రిత్వ శాఖ ఆమోదించడంతో ఈ ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొంది. కాగా జగదీప్ ధన్‌ఖర్ సోమవారం అనారోగ్య కారణాలతో ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. ఇక ఉప రాష్ట్రపతి ఎన్నికకు పార్లమెంటులో స్పష్టమైన ఆధిక్యత సాధించాల్సి ఉంటుంది. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో పాటు రాజ్యసభలో నామినేటెడ్ సభ్యులకూ ఈ ఎన్నికలో పాల్గొనే ఓటుహక్కు ఉంటుంది. ఉభయసభల్లో నలుగురు నామినేటెడ్ సభ్యులతో కలిపి ప్రస్తుతం మొత్తం సభ్యుల సంఖ్య 786గా ఉంది. ఇందులో మెజారిటీ సాధించేందుకు 394 మంది సభ్యుల మద్దతు అవసరమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విపక్షాల నిరసనలతో వరుసగా మూడవ రోజు కూడా పార్లమెంటు ఉభయ సభల కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. బీహార్ ఎన్నికల జాబితాలో చేపట్టిన సవరణలు ఇతర అంశాలపై చర్చ చేపట్టాలని విపక్షాల డిమాండ్ చేస్తూ గందర గోళం సృష్టించడంతో ఉభయ సభలు ఈరోజు రెండు సార్లు వాయిదా పడ్డాయి. లోక్‌సభ రెండవ వాయిదా తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి సమావేశమవగా కాంగ్రెస్, డిఎంకె, సమాజ్‌వాదీ పార్టీ సహా ప్రతిపక్ష పార్టీలు సభాపతి సమీపంలోకి వెళ్ళి నినాదాలు చేశారు. గోవా రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాల్లో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్వ్యవస్థీకరణ బిల్లు, 2024కు సంబంధించి మరొక ముఖ్యమైన బిల్లు ఈరోజు జాబితా చేయబడిందని పేర్కొంటూ సభ సజావుగా సాగడానికి సహకరించాలని ప్రిసైడింగ్ ఆఫీసర్ నిరసన తెలిపిన సభ్యులను పదే పదే కోరినప్పటికీ గందరగోళం కొనసాగడంతో సభను రేపటికి వాయిదా వేశారు. ఇక సభలో చర్చకు విపక్షాలు ముందుకు రావకపోవడంపై కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అసహనం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమ పథకాలకు సంబంధించిన అనేక ప్రశ్నలు ప్రశ్నోత్తరాల సమయంలో సభలో జాబితా చేయబడ్డాయని కానీ ప్రతిపక్షాలు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం సరికాదన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా పలు రహదారులపై గత ఆరు నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 27వేల మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్ర రోడ్డు, రవాణా రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ ఏడాది జనవరి - జూన్ మధ్యకాలంలో ఈ మరణాలు నమోదైనట్లు తెలిపారు. రాజ్యసభలో ఈరోజు సభ్యులు అడిగిన ఒక ప్రశ్నకు ఆయన ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాలను వెల్లడించారు. జాతీయ రహదారులపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 26 వేల 770 మంది మృతి చెందారని.. గత సంవత్సరం రోడ్డు ప్రమాదాల్లో దేశ వ్యాప్తంగా మొత్తం 52 వేల 609 మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్రమంత్రి తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

“ఆపరేషన్ సిందూర్” దాని నిర్దేశిత లక్ష్యాలను సాధించిన తర్వాత పాకిస్తాన్ అభ్యర్థన మేరకు నిలిపివేయబడిందని ఐక్య రాజ్య సమితిలో భారతదేశ శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీష్ పేర్కొన్నారు. అంతర్జాతీయ శాంతిని ప్రోత్సహించడానికి ఉగ్రవాదంపై జీరో టోలరెన్స్ విధానాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని ఆయన ఈరోజు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి తెలియజేశారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాలపై తీవ్రమైన ఆంక్షలను విధించాలని భారత్ స్పష్టమైన వైఖరితో ఉందని పర్వతనేని హరీష్ పునరుద్ఘాటిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దూరదర్శన్ ఫ్రీ డిష్‌లో దక్షిణ భారత రాష్ట్రాల ప్రాంతీయ భాషా ఛానెళ్ల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. ఈరోజు లోక్ సభలో ప్రశ్నోత్తరాల సమయంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శభరి, కలిశెట్టి అప్పలనాయుడు దక్షిణ భారతదేశంలో దూరదర్శన్ ఫ్రీ డిష్ పరిధిని విస్తరించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి తెలియజేయాలని కోరారు. దీనికి ఎల్.మురుగన్ సమాధానమిస్తూ... మెరుగైన ప్రాంతీయ ప్రాతినిధ్యం కోసం, దూరదర్శన్ ఫ్రీ డిష్ ప్లాట్‌ఫామ్ ఈ-వేలంలో దక్షిణ భారత భాషా ఛానెల్స్ కు స్లాట్‌లు కేటాయించామన్నారు. ప్రైవేట్ ప్రసార సంస్థల నుండి భాగస్వామ్యాన్ని సైతం ఆహ్వానించేందుకు నిబంధనలు సరళీకృతం చేశామన్నారు.

అదేవిధంగా దేశవ్యాప్తంగా ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ఆధునీకరణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, బడ్జెట్ కేటాయింపుల వివరాలను తెలియజేయాలని బీహార్ లోని మహారాజ్‌గంజ్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్ సభ సభ్యులు జనార్ధన్ సింగ్ సిగర్వాల్ ప్రశ్నోత్తరాల సమయంలో కోరారు. బ్రాడ్‌కాస్టింగ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అండ్ నెట్ వర్క్ డెవలప్‌మెంట్ (BIND) పథకం ద్వారా ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాలను ఆధునీకరిస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ సమాధానమిచ్చారు. ఈ పథకానికి 2 వేల 539 కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించిందని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ అభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణలో ప్రసార మాధ్యమాల కీలక పాత్రను గుర్తు చేసుకునేందుకు ఈరోజు జాతీయ ప్రసార దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. 1927లో ఇదే రోజున ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ ఆధ్వర్యంలో బొంబాయి స్టేషన్ నుండి దేశంలో మొట్టమొదటి రేడియో కార్యక్రమం ప్రసారం చేయబడింది. 1936 జూన్ 8న ఇండియన్ స్టేట్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్‌ను ఆల్ ఇండియా రేడియోగా మార్చగా.. ఆ తరువాత ఆకాశవాణిగా నామకరణం చేయబడింది. ఇక భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆకాశవాణి ఎప్పటికప్పుడు పునరుద్ధరించబడుతోందని, జాతీయ ప్రసార దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రగ్యా పలివాల్ గౌర్ మాట్లాడుతూ....

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఇంగ్లాండ్‌లోని మాంచెస్టర్ వేదికగా జరుగుతున్న నాలుగవ క్రికెట్ టెస్ట్ మ్యాచ్ లో తొలిరోజు భారత్ టీ విరామ సమయానికి 3 వికెట్ల నష్టానికి 149 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =